## 33 వేల నాణాలతో మువ్వన్నెల జెండా



**గజ్వేల్ టౌన్, జనవరి 25 (ప్రభాతవార్త):** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు 33వేల నాణాలను ఉపయోగించి మువ్వన్నెల జాతీయజెండాను అద్భుతంగా చిత్రించారు. మూడు రోజులు గా శ్రమించి 10 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో చిత్రించిన చిత్రాన్ని రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి తన దేశభక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి భారతదేశం చిత్రపటాలు, జెండాలు ఎన్నో రకాలుగా చిత్రించానని, మరెన్నో చిత్రించి రుణం తీర్చుకోవాలని ఉందన్నారు. మాతృభూమి కోసం ప్రాణాలను త్యాగం చేసిన వారందరికి ఈ చిత్రం అంకితమన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## నేటి నుంచి శ్రీచిత్తారమ్మ జాతర ఉత్సవాలు

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 25, ప్రభాతవార్త :** శ్రీచిత్తారమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు (జాతర) శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయి. పట్టణ సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రతియేడు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి మూడు రోజులపాటు కొనసాగే ఈ జాతర ఉత్సవాలలో పట్టణ ప్రజలే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల వారు అధికసంఖ్యలో పాల్గొంటారు. కాగా 26వ తేది శుక్రవారం నాడు ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి శతఘటాభిషేకము, గణపతి పూజ, పుణ్యాహవచనము, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ట, నిత్యబలిహారణలు, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనము. తేది 27న శనివారం నిత్యపూజ, చండీహోమము, నిత్యబలిహారణలు, తీర్థ ప్రసాదవితరణ, ఆశీర్వచనము, 28న నిత్యపూజ, ఉదయం 11.05 గంటలకు అమ్మవారికి శాంతి కళ్యాణము, ఒడిబియ్యము, సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి బోనాలు తీయుట, నిత్యబలిహారాలు, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనము. తేది 29న సోమవారము నిత్యపూజలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానము, సాయంత్రం బోనాలు గృహప్రవేశం కార్యక్రమాలు నిర్వహించబడుతుందని ఆలయ ప్రధాన అర్చకులు జొన్నోజు నాగరాజుచార్యులు తెలిపారు.



మాట్లాడుతున్న సీపీ డా॥అనురాధ

### శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే
## ఎంతటివారైనా చర్యలు తప్పవు
### సీపీ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ఎక్కడ శాంతి భద్రతలు ఉంటాయో అక్కడ అభివృద్ధి జరుగుతుందని సీపీ డా॥అనురాధ అన్నారు. గురువారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడారు. శాంతిభ ద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవన్నారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రజలకు ఎల్లవేళాల అ oదుబాటులో ఉండి పోలీసులు సేవలు అందిస్తారని తెలిపారు. డ్రగ్ ఫ్రీ కమిషనేరేట్‌గా ఉండాలనేది మా తక్షణ కర్తవ్యమన్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రమాదాల సంఖ్య పెరిగిందని నివారణకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైతే తక్షణమే 1930 కాల్ చేయాలని వెంటనే ఖాతా ఫ్రీజ్ చేస్తామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాల, జూదం తదితర వాటిపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం
### ఇన్‌చార్జి డిటిఓ లక్ష్మణ్

**సిద్దిపేట రూరల్, జనవరి 25, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న ఇంచార్జి డిటిఓ లక్ష్మణ్

రోడ్డు భద్రత అందరి బాధ్యత అని జిల్లా ఇంచార్జి డిటిఓ లక్ష్మణ్ అన్నారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం కార్యాలయ అవరణలో వాహనాదారులకు రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీటు బెల్టు విధిగా ధరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్లుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు, సలహాలు పాటిస్తూ క్షేమంగా డ్రైవింగ్ చేసి గమ్యస్థానాలకు చేరుకోవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి యేటా భద్రత వారోత్సవాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజల్లో మార్పువచ్చినప్పుడే రోడ్డుప్రమాదాలు తగ్గుతయాన్నారు. రాంగ్ రూట్లో వాహనాలు నడిపి ప్రమాదాలబారిన పడ్డొదన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. విధి నిర్వహణలో డ్రైవర్‌కు గుండెఊపోటు వస్తే సిపిఆర్ చేసి ఏ విధంగా రక్షించాలో వైద్య సిబ్బంది వాహనాదారుల కళ్లకు కట్టినట్లుచేసి చూపించారు. కార్యక్రమంలో ఎంవిఐ కవిత, రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ డిఎంహెచ్‌వోగా డాక్టర్ చందునాయక్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ చందు నాయక్

**మెదక్ అర్బన్, జనవరి 25 ప్రభాతవార్త:** ఉత్తమ జిల్లా వైద్యాధికారిగా (డీఎంహెచ్‌వో) డాక్టర్ చందు నాయక్ ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేటలో జరిగిన 2022-23 సంవత్సరం హెల్త్ రివ్యూ సందర్భంగా మెదక్ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు నాయక్‌కు హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, హెల్త్ కమీషనర్ ఆర్‌వి. కర్ణన్‌ల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. మెటర్నల్ హెల్త్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, చైల్డ్ హెల్త్, ఇమ్యూనైజేషన్‌లో 11వ ర్యాంకు, ఎనిమియా ముక్తా భారత్‌లో 26వ ర్యాకు, టీబీలో ఫస్ట్ ర్యాంక్, తెలంగాణ డయాగ్నస్టిక్‌లో 2వ ర్యాంక్, ఎనీసడీలో ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు గాను బెస్ట్ డీఎంహెచ్‌వో అవార్డు లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది సహకారంతో ఈ అవార్డు లభించిందన్నారు. అవార్డు తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు. భవిష్యత్‌లో మెదక్ జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. డీఎంహెచ్‌వో చందునాయక్‌కు అవార్డు రావడం పట్ల జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

### జాతీయ రహదారి సర్వేను అడ్డుకున్న గ్రామస్థులు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట మండలం దుద్దెడ నుండి సిరిసిల్ల వరకు జరుగుతున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్ 365 బైపాస్ సర్వేను గురువారం రోజున చిన్నగుండవెల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భూసేకరణకు గ్రామానికి వచ్చిన అధికారులను తమ గ్రామ సమీపంలో బైపాస్ నిర్మించవద్దని కోరారు. గ్రామానికి అర్థ కిలోమీటర్ దూరంలోనే సిద్దిపేట రింగు రోడ్డు ఉందని, మరోరోడ్డు నిర్మాణం చేపడితే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే సాగునీటి నిర్మాణానికి గ్రామంలో రైతుల వద్ద పెద్ద మొత్తంలో భూములు సేకరించారని, మరోసారి భూములు సేకరిస్తే ఉన్నభూములు కోల్పోయి జీవనోపాది కరువై రోడ్డున పడిపోయే అవకాశం ఉందని రైతులు వారి ఆవేదన వెల్లబోసుకున్నారు.

## హామీలన్నీ అమలు చేస్తాం-రాష్ట్రాభివృద్ధి సాధిస్తా

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

**జహీరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:**

ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చామని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామిని అమలు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామాత్యులు దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ఉప్పరపల్లి తండాలో కొలువున్న గిరిజనుల ఆరాధ్య దైవం మోతిమాత ఉత్సవాలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, మాజీ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, ప్రియాంక గుండారెడ్డి తదితరులతో చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**పిహెచ్‌సి భవనానికి శ్రీకారం...**

ప్రజల వినతి, మొగుడంపల్లి పిహెచ్‌సి డాక్టర్ సీతారాం సూచనల మేరకు ఆలయ ఆవరణలో అప్పటికి అప్పుడు పిహెచ్‌సి భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మోతిమాత ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో



మాట్లాడుతున్న దామోదర్ రాజనర్సింహ

అభివృద్ధి చెందేలా తన వంతు సహకారం అందిస్తామన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు నాగిశెట్టి రాథోడ్, మాజీ ఎంపిపి నారాయణరెడ్డి, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, ఎంజి రాములు, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్‌మియా, పి రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్, సర్పంచ్ రామ్‌శెట్టి చవాన్, సర్పంచ్ శంకర్ నాయక్, నాయకులు నారాయణ, గోపాల్, చందర్ నాయక్, పాండు రాథోడ్, తులసిరామ్ రాథోడ్, ఆర్‌డిఓ వెంకరెడ్డి, ఆయా శాఖల అధికారులు, జాతర ఉత్సవ కమిటి బాధ్యులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జాతర ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా డిఎస్‌పి రఘు ఆధ్వర్యంలో సిఐలు బి రాజు, నోముల వెంకటేశ్, ఎస్‌ఐలు, సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.

## ఓటు హక్కు అందరికీ సమానం

- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది
- రాష్ట్రంలో పోలింగ్ నమోదులో ద్వితీయ స్థానం
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



స్వీప్ నిర్వహించిన కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, జనవరి 25 ప్రభాతవార్త:**

జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుంచి స్థానిక కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఓటరు చైతన్య రథంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధితో కూడిన సుస్థిర ప్రజాస్వామ్యాన్ని ఒక్క ఓటుతోనే సాధించుకోగలమని, అలాంటి ఓటింగ్ డేను మనమందరం పండగలా నిర్వహించుకోవాలన్నారు. దేశ అభివృద్ధిని ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల చేత, ప్రజలకు పరిపాలనను నడిపే వ్యక్తిని చట్టబద్ధంగా ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవడంలో అందరు ముందుడాన్నారు. ఓటును ప్రలోభాలకు, స్వలాభాల కొరకు వినియోగించకూడదన్నారు. జిల్లాలో అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా స్వీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌ల కోసం హోం ఓటింగ్ విధానాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. స్వేచ్ఛాయుత నిష్పక్షపాత వాతావరణంలో గత నెలలో శాసనసభ నియోజకవర్గ ఎన్నికలను నిర్వహించుకున్నామని, ఇదే స్ఫూర్తితో రాబోవు పార్లమెంట్ ఎన్నికలను జరుపుకుందామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఓటింగ్‌లో ముందు వరుసలో ఉంటున్నారని, పట్టణ ప్రాంతాల వారు, విద్యావంతులు ఓటుకు దూరంగా ఉంటున్నారని, విద్యావంతుల్లో మార్పు రావాలన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం తరపున అన్నిసౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. నర్సాపూర్ మండలం చిప్పల కుర్తి గ్రామం కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నుక్కడ్ నాటకానికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఓటు ప్రతిజ్ఞను చేయించారు. జిల్లాలో వివిధ కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాలపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులను జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల విభాగ సూపరింటిండెంట్ హర్దీప్‌సింగ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వో విద్యార్థులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొట్లపల్లి శ్రీస్వయంభూ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఆర్డీవో పూజలు

**హుస్నాబాద్‌రూరల్, జనవరి 25, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో గురువారం తుఫ్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి జయచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆర్డీవోకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయచంద్రారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో అర్చకులతో కలసి శివరాత్రి ముందస్తు ఏర్పాట్లను గురించి చర్చించారు. ఆలయ అభివృద్ధి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో హుస్నాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన ఆయన హుస్నాబాద్‌కు వచ్చిన నేపథ్యంలో ఆయన అభిమానులు ఆయనను కలిసి మళ్లీ హుస్నాబాద్‌కు రవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఖేడ్ సహాయ కార్మిక కార్యాలయానికి సుస్తి..

- విధుల పట్ల నిర్లక్ష్యం.. జిల్లా అధికారుల పర్యవేక్షణ కరవు
- మామూళ్ల మత్తులో ఖేడ్ లేబర్ కార్యాలయ సిబ్బంది

**నారాయణఖేడ్, జనవరి 25 ప్రభాతవార్త:**

ప్రభుత్వం ఎన్నో లక్షలు ఖర్చు చేసి భవనాలు, ఉద్యోగులను నియమిస్తే నారాయణఖేడ్ ప్రాంతంలో ఆయాశాఖల అధికారులు నెలకు ఒకసారి లేక రెండు సార్లు వచ్చి చేతులు దులుపుకుంటున్నారు. నారాయణఖేడ్‌నియోజకవర్గానికి ఏడు మండలాలకు నారాయణఖేడ్, మనూరు, నాగల్‌గిద్దా, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేటలకు ఆయా శాఖల ఉద్యోగులు సమయ పాలన లేకుండా తమ ఇష్టారీతిగా వస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు కన్నెత్తి చూడడం లేదు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి నారాయణఖేడ్ ప్రాంతం దూరం కావడంతో జిల్లాస్థాయి అధికారులు ఇష్టంవచ్చినపుడు ఎప్పుడోవచ్చి ఒకసారి తనిఖీలుచేసి చేతులు దులుపుకుంటున్నారు. నారాయణఖేడ్‌లో కొన్ని సంవత్సరాల క్రితం ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సహాయ కార్మిక అసిస్టెంట్ కార్యాలయం లేబర్ కారాల్యయం మంజూరుచేసి సిబ్బందిని నియమించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు సహాయ కార్మిక అసిస్టెంట్ అధికారి యాదగిరి, ఒక అటెండర్‌ను నియమించారు. ఉద్యోగులు పనిచేసే చోట ఉండాలని ప్రభుత్వం సూచించినా విధులకు మాత్రం డుమ్మాలు కొట్టడం ప్రభుత్వ అధికారులకు మామూలైంది. నారాయణఖేడ్ అసిస్టెంట్ లేబర్ శాఖ అధికారి ఏడు మండలాలకు అధికారి ఉండి వారానికో పదిహేను రోజులకో మారు వచ్చి సంతకాలు చేసి వెళుతుంటారని స్థానికులు చెబుతున్నారు. ఆయా మండలాలకు చెందిన ప్రజలు రోజుకు ఎంతో మంది లేబర్ కార్డులకు తదితర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చి పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ఉదయం పది గంటలకు తెరిచే కార్యాలయం రోజుకు ఒకసారి కూడా తెరుచుకోవడం లేదని కనీసం గేటు కూడా తీయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.



నారాయణఖేడ్‌లో సహాయ కార్మిక అధికారి కార్యాలయం ఎప్పుడు తాళమే దర్శనం

నారాయణఖేడ్ కార్యాలయంలో పనిచేసే నర్సింలు అటెండర్ కూడా అందుబాటులో లేకపోగా పనికావాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని చెబుతూ తమ ఇష్టారీతిగా కార్యాలయానికి ఎప్పుడో ఒకసారి వస్తాడని ఆయాగ్రామాల ప్రజలు తెలిపారు. ఇదిలా ఉండగా కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన అనిత తల్లి సాలవ్వ డెలివరీకి సంబంధించిన డబ్బులకు ఆరు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. బాధితురాలు ఫోన్‌లో యాదగిరి అధికారికి సంప్రదిస్తే ఆరోగ్యం బాగాలేనందున ఏమైన పనులు ఉంటే నర్సింలు దగ్గరికి వెళ్లండని సమాధానం ఇస్తుండటం గమనార్హం. ఇదిలా ఉండగా నర్సింలు అటెండర్ మాత్రం మీరు డబ్బులు ఇస్తేనే పని జరుగుతుందని చెప్పడంతో అనిత తల్లి సాలవ్వ రూ.రెండువేలు ఇచ్చానని కార్యాలయం ముందు తమ గోడును వెళ్లబోసుకుంది. ఇప్పటికైనా నూతనంగా వచ్చిన కలెక్టరు స్పందించి ప్రసూతికి సంబంధించిన డబ్బులు తొందరగా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమె వేడుకుంది. ఇన్ని రోజులుగా విధులకు సరిగ్గా రాకపోవడంతో ఉన్నతాధికారులు కూడా తనిఖీలు చేయకపోవడం ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**అధికారి వివరణ...**

ఈ విషయమై లేబర్ జిల్లా అధికారి రవీందర్ రెడ్డిని వివరణ కోరగా నారాయణఖేడ్‌లో పనిచేస్తున్న యాదగిరి ఆరోగ్యం బాగాలేనందున మరో అధికారిని నియమించేలా ప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. డబ్బులు తీసుకుంటున్న విషయం నా దృష్టికి రాలేదన్నారు. మా కార్యాలయ సిబ్బంది ఎవరైనా డబ్బులుతీసుకున్నట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

## దేశానికి స్వచ్ఛత పాఠాలు నేర్పింది సిద్దిపేటే

### దేశానికి మొదటి పౌరుడు రాష్ట్రపతి.. గ్రామానికి సర్పంచ్
### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

దేశానికి మొదటి పౌరుడు రాష్ట్రపతి..గ్రామానికి మొదటి పౌరుడు సర్పంచ్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సత్కారంలో పాల్గొని మాట్లాడారు. మొదటి పౌరుడు అనేది ఒక గుర్తింపు మాత్రమే కాదని గ్రామ అభివృద్ధిని, సంక్షేమాన్ని ముందుండి నడిపించే వ్యక్తి సర్పంచ్ అన్నారు. దేశానికి స్వచ్ఛత పాఠాలు నేర్పింది సిద్దిపేటే అని..అవార్డులో అదర్శం సిద్దిపేటే అని మీ చైతన్యం చాలా గొప్పదన్నారు. నియోజకవర్గానికి 33 జాతీయ స్థాయి అవార్డులు, 9 రాష్ట్ర స్థాయి అవార్డులు, 5 జిల్లాస్థాయి అవార్డులు వచ్చాయన్నారు. నియోజకవర్గంలో 46 గ్రామాలకు నిర్మల్ పురస్కార్‌లు వచ్చాయన్నారు. సర్పంచ్‌ల పదవి గడవు పొడగింపుపై పార్టీ పక్షణ ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. మీరు అంత నా కుటుంబ సభ్యులు మీకు కష్టం వస్తే నేను ఉన్న..నాకు కష్టం వస్తే మీరు ఉన్నారని పేర్కొన్నారు. సిద్దిపేటకు సాగు, తాగు నీరు. గోదావరి జలకల ఈ హయాంలో రావడం మీ జీవితంలో ఒక తృప్తి అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపిపిలు మాణిక్యరెడ్డి, బాలకృష్ణయాదవ్, జడ్పీటిసి ఉమా, ప్రవళిక, సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలి...**

పదిలో పట్టుదలతో 119 నియోజకవర్గాలలో సిద్దిపేట నియోజకవర్గం వంద శాతం ఫలితాలు సాధించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఒక్క విద్యార్థి కూడా పెయిల్ కావొద్దన్నారు. ఎప్పలిలాగా పదో తరగత పరీక్ష ఫలితాలపై దృష్టి పెట్టాలన్నారు. సిద్దిపేటకు ఉన్న ప్రతిష్టను..గౌరవాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అన్ని మనమై అండగా ఉండాలన్నారు. నియోజకవర్గంలోని అయా పాఠశాలలో 2516 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని అందరూ పాస్ కావాలన్నారు. సమావేశంలో డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి నోడల్ అధికారి రామస్వామి, మండల విద్యాధికారులు యాదవరెడ్డి, దేశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంథన్ పాఠశాలలో యూనివర్సిటీ ఫెయిర్

### -పాల్గొన్న 50 విశ్వవిద్యాలయాలు



మంథన్ పాఠశాలలో యూనివర్సిటీ ఫెయిర్ నిర్వహిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, జనవరి 25, ప్రభాతవార్త:** తెల్లాపూర్‌లోని మంథన్ పాఠశాలలో యూనివర్సిటీ ఫెయిర్ నిర్వహించారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్, కామర్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, ప్యూర్ స్పైన్సెస్‌లలో విభిన్న ప్రోగ్రామ్‌లను అందిస్తున్న దేశంలోని 20కి పైగా విశ్వవిద్యాలయాలు, కళాశాలు ఫెయిర్‌లో పాల్గొన్నాయి. ఫ్లేమ్ విశ్వవిద్యాలయం(పూణే), గీతం విద్యాలయం (హైద్రాబాద్), మహీంద్రా విశ్వవిద్యాలయం (హైద్రాబాద్), విద్యాశిల్ప్ యూనివర్సిటీ(బెంగళూరు), థాపర్ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ (పంజాబ్), కలినరీ గురు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (హైద్రాబాద్), బెన్నెట్ యూనివర్సిటీ (నోయిడా)లు పాల్గొన్నాయి. విద్యార్థులు భవిష్యత్తులో విశ్వాసంతో ముందుకు సాగగంలో భాగంగా చేపట్టే కార్యక్రమాల్లో యూనివర్సిటీ ఫెయిర్ ఒకటని వక్తలు పేర్కొన్నారు.

## క్రీడల పేరుతో నిధులు కాజేసిన హత్నూర గురుకుల పాఠశాల అధికారులు!

**హత్నూర జనవరి 25, ప్రభాతవార్త:** క్రీడల పేరుతో నిధులను దోచుకున్నారు హత్నూరలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలోని కొందరు అధికారులు. తమచేతి వాటాన్ని ప్రదర్శించి నిధులను మింగారు. గత అక్టోబరు నెల 13 నుండి 16 వరకు 9వ జోనల్ ఆటల పోటీలు హత్నూరలో నిర్వహించారు. ఈ టోర్నమెంటల్‌లో సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల 11 పాఠశాలలకు చెందిన 925 విద్యార్థులు, వివిధ విభాగాల ఆటల పోటీలలో పాల్గొన్నారు. ఆటల నిర్వాహణకు ప్రభుత్వం మూడులక్షల రుపాయల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను క్రీడలకు ఉపయోగించాల్సిన నిర్వాహణ అధికారులు, టోర్నమెంట్ పేరుతో ఇతర దాతల వద్ద, డొనేషన్లు తీసుకొచ్చి, వాటిని తామే కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టించి నిధులను కాజేసినట్లు తెలిసింది.. ట్రోఫీలు, మెడల్స్, కప్పులు దాతల ద్వారా స్వీకరించి వాటికి కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టించినట్లు రోపణలున్నాయి. క్రీడల నిర్వాహణకు సంబందించి అటవస్తువులు, ట్రోపిలు, ట్రిక్స్, దస్తు, టెంట్లు, డెకోరేషన్, రన్నింగ్ ట్రాక్ నిర్మాణం, కలర్స్, టపాసులు, మైదానం చదును వంటి తదితర పనుల పేరుతో బిల్లులు రుపోందించి నిధులు విడుదల కోరకు ప్రతిపాదనలను, సంబందిత పై అధికారులకు పంపారు. కాని వారు రుపోందించిన బిల్లులలో మాత్రం గురుకులపాఠశాలలో క్రీడల నిర్వాహణ పేరుతో కొందరు దాతల నుండి వస్తువు రుపాంలో స్వీకరించి బిల్లులు తయారు చేసి నిధులను కాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గురుకుల సొసైటి ఉన్నాతాదికారులు క్రీడల నిర్వాహణ నిధుల వినియోగంపై పూర్తి విచారణ జరిపి, బాద్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లి, తండ్రులు అధికారులను కోరుతున్నారు. ఈవిషయమై హత్నూర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్‌ను వివరణ కోరగా ఈవిషయం నాదృష్టికి కూడ వచ్చిందని, ఎవరో పడిరానివారు చేసిన ఆరోపణలని, ఇందులో వాస్తవంలేదని అన్నారు.



హత్నూరలోని గురుకుల పాఠశాల



గవర్నర్ తమిళిసై నుంచి బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

## కెజిబివి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి

**నర్సాపూర్,జనవరి 25,ప్రభాతవార్త:** 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన కెజీబీవి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి తమ సత్తా చాటారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో భాగంగా యంగ్ ఓటర్స్ (నుక్కడ్ నాటక్) స్కిట్‌ను చేసి రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని కెజిబీవి జూనియర్ కళాశాల విద్యార్థులు పొందడం జరిగింది. ఈ బహుమతిని గవర్నర్ తమిళసై సుందర్‌రాజన్ నుంచి అందుకోవడం జరిగింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులు వీణా, మంజుల, మౌనిక, అర్చన, దివ్య, అర్చన స్పందన, అంకితలను ప్రిన్సిపాల్ శ్వేత, అధ్యాపకులు అభినందించారు. కళాశాలకు ప్రథమ బహుమతి రావడం గవర్నర్ చేతుల మీదుగా ఈ బహుమతిని అందుకోవడం చాలా సంతోషంగా గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ శ్వేత తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, ప్రిన్సిపాల్ శ్వేత, గైడ్ టీచర్ విష్ణుతేజ తదితరులు పాల్గొన్నారు.

## 29న నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

**నర్సాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం ఈనెల 29 న తేదీని నిర్ణయించడం జరిగిందని ఈమేరకు నోటీసు జారీ చేసినట్లు నర్సాపూర్ మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అదికారి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఈ ఎన్నిక కోసం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డిని ఈ ఎన్నికల నిర్వహణ కు ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.ఈ మేరకు ఈ నెల 29 న ఉదయం 11 గంటలకు సభ్యులందరు హాజరు కావాలని ఆయన సూచించారు.పార్టీ విప్‌ను ఈ నెల 28 తేదీ లోపు ప్రత్యేకాధికారికి అందజేయవల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు.

## హత్నూరలో జాతీయ ఓటరు దినోత్సవం

**హత్నూర, జనవరి 25, ప్రభాతవార్త:** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రమైన హత్నూరలో గురువారం అధికారులు ర్యాలీ నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం నుండి హత్నూర గ్రామాం వరకు ర్యాలీ నిర్వహించారు.ఓటరు ప్రాదన్యతను తెలియజేసే బ్యానర్‌ను ప్రదర్శించారు. గ్రామంలోని ప్రధానవీధులలో ర్యాలీ కనసాగింది. ఈ కార్యాక్రమంలో తహసిల్దార్ సంధ్య, ఎస్.ఐ.సుభాష్, ఆర్.ఐ.శ్రీనివాస్, పంచాయతీ కార్యాదర్శి, అంగన్‌వాడి టీచర్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా అధికారులు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, జనవరి 24, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకులకు, ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించాలని ఆర్డీవో శ్రీనవాసులు పేర్కొన్నారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్‌లో ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ కమలాద్రి అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ నర్సాపూర్ అటవీశాఖ అధికారి కార్యాలయం నుండి ప్రారంభ మై బస్టాండ్ రోడ్డు మీదుగా అంబెద్కర్ చౌరస్తా వరకు సాగింది. ఈ చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి ఓటు హక్కు పై. ఓటు వినియోగం పై,ఓటు నమోదు పై వివరించడం జరిగింది. ఈ సందర్బంగా ఈ ర్యాలీలో ఓటు హక్కు పై నినాదాలు చేశారు. ఈసందర్బంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కయువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఓటు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నా తదితర విషయాల పై ప్రజలు అవగాహన కల్గిఉండాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ కమలాద్రి లతో పాటు, డిటి ఆదర్శ్‌కుమార్, ఆర్ఐ లు సిద్దిరాంరెడ్డి, ఫైజల్, ఎలక్షన్ డిటి మహేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర్,అధికారులు, సిబబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రొ. కోదండరాం ఎమ్మెల్సీ కావడం హర్షణీయం

**గజ్వేల్ టౌన్, జనవరి 25 (ప్రభాతవార్త):** ఉద్యమకారుడు ఆచార్య ప్రొఫెసర్ కోదండరాం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ కావడం హర్షణీయమని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిపించిన రథసారధి, తెలంగాణ నీళ్ళు, నిధులు, నియామకాల కోసం అన్ని రాజకీయ పార్టీలను ఏకంచేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

## బివిఆర్ఐటి కళాశాలకు ప్రశంసా పత్రం

**నర్సాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:** పట్టణసమీపంలోని బివిఆర్ఐటి కళాశాలకు జిల్లాస్థాయిలో ప్రశంసాపత్రం లభించింది. ప్రశంసాపత్రాన్ని గురువారం బివిఆర్ఐటి కళాశాలలో ప్రిన్సిపాల్ సంజయ్ దూబేకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అందజేశారు. ఈ సందర్బంగా సంజయ్ దూబే మాట్లాడుతూ కళాశాలలోని ఎలక్ట్రోల్‌లిటరరీ క్లబ్ జిల్లాలో మొదటి స్థానంలో నిలించిందన్నారు. ఈ క్లబ్ ద్వార కళాశాలలో ఎన్నికలకు సంబందించిన వివిధ ఆంశాలను ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవగాహన పరుస్తున్నందున ఈ ప్రశంసా పత్రం రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆపిసర్ రాజు, ప్రమోద్ కుమార్, ఏవో శ్రీకాంత్ ఉన్నారు.

### రవాణా రంగంలో కార్మికులకు

## సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు**

**నర్సాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ను ఏర్పాటుచేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. ఈ సందర్బంగా నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయలంలో ఆర్డీవో శ్రీనివాసులు కు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈసందర్బంగా కడారి నాగరాజు మాట్లాడుతూ రవాణా రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్ష ల మంది కార్మికులు ప చేస్తున్నారన్నారు.రవాణా రంగంలోని కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ను ఏర్పాటు చేసి ఉపాధీ అవకాశాలు కల్పించాలని, పిల్లల చదువులు, కార్మికులకు ఏదైనా జరిగితే భీమా సౌకర్యం, పెళ్ళిల్లకు సహకారం వంటి వి బోర్డులో పెట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు మూలంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారందరికి జీవితభీమా 4500 సౌకర్యం కల్పించాలనిడిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత106(1) (2) ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంవి యాక్టు 2019 చట్టం మూలంగా అనేక మంది కార్మికులు తప్పులేకున్నా యాక్సిడెంట్ జరిగినా చోటనే ఉండాలంటే ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని గుర్తు చేశారు. కేరళా తరహాలో కార్మికులకు ఆన్‌లైన్ ఆప్ తీసుకురావాలని నాగరాజు కోరారు. కార్యక్రమంలో నర్సా గౌడ్, ఆంజనేయులుగౌడ్, కుమార్, వెంకటచారి, నరేశ్‌గౌడ్, కిశోర్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై సమీక్ష

**శామీర్‌పేట, జనవరి 25, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో అక్రమ నిర్మాణాలను, కబ్జాలను అరికట్టటానికి టిఎస్ బిపాస్ సంబంధిత అధికారులతో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జైతురామ్ సమీక్షించారు. గురువారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో టిఎస్‌బిపాస్ సంబంధిత అధికారులు, టీమ్‌ల సభ్యులతో కమిషనర్ సమీక్షించారు. టిఎస్‌బిపాస్ జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్, సభ్యులు, (డిమాలిషన్ స్క్వాడ్ బృందం) మున్సిపల్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు చట్టపరమైన చర్యలు తీసుకునుటకు సంబంధిత అధికా రులతో సమావేశం ఏర్పాటు జరిగిందని కమిషనర్ జైతురామ్ పేర్కొన్నారు.తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూములలో అక్రమణలు జరి గినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, పోలీసు అధికారులు, అగ్నిమాపకశాఖ అధికారులు, ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

**టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు**



మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాతరావు, ఇతర నాయకులు

**రామాయంపేట, జనవరి 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు అన్నారు. గురువారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి పాత్రికేయుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామాయంపేట, నిజాంపేట, చిన్న శంకరంపేట మండలాల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. గత టీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని వెలికితీసి, అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కచ్చితంగా తీర్చుతామని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే విదేశి పర్యటన పూర్తిచేసుకుని వచ్చారని, తొందరలోనే ఆయన అన్ని గ్రామాలలో పరిస్థితి ప్రజలకుఉన్న సమస్యలను స్వయంగా తెలుసుకొని ఒక్కోటి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తారని తెలిపారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్‌లను లబ్దిదారులకు కేటాయించిన విషయంలో స్థానిక టీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఈ విషయాన్ని తొందరలోనే బయటపెడతామని ఆయన హెచ్చరించారు. కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్‌లను ఎవరు అమ్ముకున్నా, వాటిని రద్దుచేసి అసలైన పేద ప్రజలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంకా మిగిలిపోయిన 56 ఇండ్లను త్వరలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అత్యంత పేదలకు, రోడ్డు వైండింగ్‌లో ఇల్లు కోల్పోయిన బాధిత ప్రజలకు పంపిణీ చేస్తారని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో మైరం, మట్టిని కాంగ్రెస్ నాయకులు కొట్టనివ్వడం లేదని టీఆర్ఎస్ నాయకులు అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని, దీన్ని తాము పూర్తి ఖండిస్తున్నట్లు తెలిపారు. నిజంగా మట్టి అవసరం ఉన్నవారికి 400 నుంచి 450 వరకు ఎవరైనా కొట్టుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, మట్టిని అడ్డం పెట్టుకొని దందాలు చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. మొరము, మట్టి ఇతర విషయాల్లో తమ కార్యకర్తలుగాని, నాయకులుగాని దందాలు చేయబోరని, దందాలు చేసే అలవాటు పదేళ్లకాలం నుంచి స్థానిక టీఆర్ఎస్ నాయకులకుచేసే అలవాటు ఉందన్నారు. అవినీతి రహిత పాలన అందించేందుకు తాము సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఎవరైనా తమ పార్టీ కార్యకర్తలు అవినీతికి పాల్పదుతున్నట్లు తెలిస్తే తమ నాయకుడికి గాని, తమకు గానీ సమచారం అందించాలని, అట్టి వారిపై తప్పక చర్యలు గానీ, పార్టీనుండి సస్పెండ్ చేస్తామని అన్నారు.

**అయ్యప్ప దేవాలయం కమిటీపై ఆరోపణలు...**

విలేకరుల సమావేశంలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన అయ్యప్ప దేవాలయంపై ఆరోపణలు చేశారు. అయ్యప్ప గుడి సొసైటీలో కొంతమంది స్థానికులు లెక్కలు అడిగితే తప్పేముందని ప్రశ్నించారు. వారి ఇంటి కోసం అడగలేదు, పైసలు డిమాండ్ చేయలేదు కదా అని ప్రశ్నించారు. ఏవిధంగా కమిటీ వేశావు? కమిటి లోని మనుషులను వేసుకున్నావు? అక్కన్నపేటకు చెందిన రాజు అనే వ్యక్తి ఎవరు? అయ్యప్పలు లేరా? కమిటీలో అన్ని వర్గాలకు స్థానం కల్పించ లేదని ఆరోపించారు. పట్టణంలో ఉన్న వెంకటేశ్వర దేవాలయం, మల్లన్న టెంపుల్ లెక్కలు చూపెడుతున్నారని, మరి అయ్యప్ప దేవాలయం లెక్కల్లో రహస్యం ఎందుకని ఆయన ప్రశ్నించారు. గత పది సంవత్సరాల నుండి రామాయంపేటలో ఉన్న టీఆర్ఎస్ నాయకులు ఏ ఒక్క పని చేయలేదని, వారు ఆర్థికంగా తప్ప మల్లె చెరువు కట్ట అలాగే ఉందని, పట్టణంలో అభివృద్ధి ఎంత మాత్రం జరగలేదని అన్నారు.పట్టణంలో నిర్మించిన ప్రతి వెంచర్‌లో శిఖంభూములు, అసైన్మెంట్ భూములు, కరిదు నామ భూములు ఉన్నాయని తెలిపారు. ఆరు ఎకరాల 10 గుంటల భూమి ఎమ్మార్వో ఆఫీస్ మీద జమ ఉండాలని, ఆ భూమి ఉందా? లేక అన్యాక్రాంతమైపోయిందా అని ఆయన ప్రశ్నించారు. ఇరిగేషన్ పథకం కింద మండలంలో ఎన్నో కుంటకు మరమ్మతులు చేయకుండానే టీఆర్ఎస్ నాయకులు బిల్లులు తీసుకున్నారని, వాటన్నింటిని బయటపెడతామన్నారు. లే అవుట్ లేకుండానే వెంచర్లు చేశారని 10 శాతం కింద ఇచ్చిన భూమిని స్థానిక టీఆర్ఎస్ నాయకులు గద్దల తన్నుకుపోయారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో పట్టణ ప్రధానకార్యదర్శి అల్లాడి వెంకటేష్, ఓబిసి సెల్ పట్టణ అధ్యక్షులు చింతల స్వామి, పార్టీ నాయకులు అశోక్, ఎనిశెట్టి సంతోష్, దండు శివశంకర్, కంభంపాటి విప్లవ్, డాకి స్వామి, తార్యానాయక్, శంకరయ్య, కాముని రవి, బైరం కుమార్, బొట్లబాబు, రెడ్డమైన నరేష్, దోమకొండ యాదగిరి, ఉసికె ప్రకాశ్, వినయ్‌సాగర్, గౌస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఫేక్ బిల్లులకు పేమెంటు చేయొద్దు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25, ప్రభాత వార్త:** మండలంలోని కొర్రెముల గ్రామ సర్పంచ్‌కు బకాయి ఉన్నట్లు చూపిస్తున్న ఫేక్ బిల్లులకు పేమేంటు చేయరాదని మేజా రీటీ పంచాయతీ సభ్యులు కార్యదర్శికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో ఆన్‌లైన్ ద్వారా ఇచ్చిన ఇంటి అనుమతుల విషయమై పూర్తి వివరాలు పంచాయతీ సభ్యులకు తెలుపాలని కోరారు. సర్పంచ్ పంచాయతీ నిధులు కొల్లగొట్టేందుకు సృష్టించిన ఫేక్ బిల్లులకు పంచాయతీ నిధులు చెల్లించరాదని నిబంధనలు అతిక్రమించి పేమేంట్ చేస్తే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పంచా యతీ సభ్యులు యెరుకల దుర్గారాజు గౌడ్, జి. లక్ష్మి, భార్గవి, బాస్కర్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

## రైల్వే డిఆర్ఎంకు జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి వినతి

**మేడ్చల్, జనవరి 25, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఇండియన్ రైల్వేస్ డిఆర్ఎం లోకేష్ విష్ణోయ్‌కి జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం ఆయన కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి వెళ్లి వినతి అందజేసిన అనంతరం జడ్పీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడు తున్నాయని, ఈ ఇబ్బందులు తొలగించే విదంగా వెంటనే బ్రిడ్జి పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కుమార్ యాదవ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు నవీన్, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం ఖాయం

**కొడంగల్, జనవరి 25 ప్రభాతవార్త :** విద్యార్థులు ఏకాగ్రత,పట్టుదలతో చదివితే పరీక్షల్లో విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్ అన్నారు.పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో గురువారం పట్టణంలోని బీసీబాలుర వసతి గృహంలో పదవ తరగతి పోటీ పరీక్షల మెటీరియల్‌ను విద్యార్దులకు అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు విద్యార్దులు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పె పాఠాలను శ్రద్దగా వింటూ ఏకాగ్రత,పట్టుదల,క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు.పది పరీక్షల మెటిరియల్‌ను సద్వినియోగం చేసుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమశేఖర్,హస్టల్ వార్డెన్‌లు రాధిక,హనుమంత్‌రెడ్డిలతో పాటు వసతి గృహం విద్యార్దులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 25, ప్రభాతవార్త**

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగ నిర్వహిం చటానికి జిల్లా అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం 9గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద గణతంత్ర దినో త్సవాన్ని పురస్కరిం చుకుని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ జాతీయ పతా కాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 8.50 గంటలకు సైబరాబాద్ సిపి విచ్చేయనున్నారు. ఆ వెంటనే 8.55 గంటలకు జిల్లా కలెక్టర్ గౌతమ్ కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు. 9గంటలకు జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్క రించనున్నారు. ఆ తరువాత పోలీసుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించనున్నారు. 9.10గం టలకు జిల్లా కలెక్టర్ సందేశం ఇవ్వనున్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రధానోత్స వంఉంటుందని డిఆర్ఓ హరిప్రియ పేర్కొన్నారు.

## గవర్నర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 25, ప్రభాతవార్త**

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుకు విచ్చేసిన రా ష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌కు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఘనంగ స్వాగతం పలికారు. గురువారం మేడ్చల్ జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలోని జెఎన్‌టియులో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌం దర్యరాజన్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఓటు హక్కు ఆయుధం లాంటిదని ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కీలకమని గవర్నర్ సూచించారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ పాల్గొని ఓటు అనేది ప్రజల చేతుల్లో ఆయుధం లాంటిందని అన్నారు. ఓటింగ్ పోలింగ్ రోజును సెలవు దినంగ భావించకుండ తమ భవిషత్‌ను నిర్ణయించే రోజుగా భావించాలని ఓటును వినియోగించుకోవా లని గవర్నర్ తమిళిసై సూచించారు.కార్యక్రమంలో ముందుగా జతీయ గీతాలాపనచేశారు.దీనిలో అడిషనల్ సిఇఓ లోకేష్‌కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత

**షాద్‌నగర్, జనవరి 25, (ప్రభాతవార్త) :** రోడ్డు భద్రత నియ మాలు పాటించడం మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు బాధ్యతతో డ్రైవింగ్ చేసి ప్రమాదాలను నివారించాలని శంషా బాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఉషాఆధ్వర్యంలో డిపో సిబ్బందికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి శంషాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమీష నర్ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను అరిక ట్టాలంటే ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా మైనర్ల వాహనాలు నడపకుండా తల్లిదం డ్రులు చూడాలని ఆయన గుర్తు చేశారు. ఒక ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతారని, వారికోసం వాహనదారులు ట్రాఫిక్ నిబంధలను పాటిస్తూ వాహనాలు నడపాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అదేవిధం గా కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోని జాగ్రత్తగా వాహనాలు నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లి పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు

**చౌడపూర్ జనవరి, 25,ప్రభాతవార్త :**

14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్బంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో మండల పరిధిలోని కొత్తపల్లి పాఠశాలకు రాష్ట్రస్థాయి ద్వితీయ అవార్డును గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అందుకున్నారు.ఓటర్ల అవగాహన కోసం నిర్వహిం చిన లఘు చిత్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి విద్యార్థులు రూపొందించి,ప్రతిభ చాటినందుకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిగా ఎంపికైంది.జెఎన్‌టీయుహెచ్ ఆడిటోరియంలో నిర్వహించిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో అవార్డును అందుకున్నారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పార్థసా రథి, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజు, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్,కలెక్టర్‌లు శశాంక్, గౌతమి పోత్రు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సురేష్, విద్యార్థులను గవర్నర్ అభినందించారు.

## శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు ప్రారంభం

**నర్సాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలను ఆలయ నిర్మాణదాత, బిజెపి నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నుండి ప్రారంభ మయ్యాయి.శ్రీమల్లికార్జునస్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీమల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలతో పాటు రుద్రయాగం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రాధామల్లేష్‌గౌడ్ దంపతులచే నిర్వహించారు. అనంతరం శ్రీరంగం పేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి మల్లికార్జునస్వామికి ప్రత్యేకపూజలు చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా భక్తి బావన కల్గి ఉండాలన్నారు.

నర్సాపూర్ బిఆర్ఎస్ నాయకులు జ్ఞానేశ్వర్‌గుప్త, నాగరాజుగౌడ్, రేఖ వెంకటేశంగుప్త, బిక్షపతిగుప్త, శ్రీనివాస్‌గౌడ్, గోపి గౌడ్ జాతర మహోత్సవాలకు హాజరై శ్రీమల్లికార్జు నస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. అలాగే అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ బోయిని కృష్ణ. గ్రామ పెద్దలు, ఒగ్గు పూజారులు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



జాతర మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

**జాతరకు హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే**

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీమల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆలయ నిర్మాణ దాత ఉత్సవాల నిర్వాహకులు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్‌తో పాటు పూజారి హరిప్రసాద్ శర్మ పూర్ణ కుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్బంగా వారు శ్రీ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి, మాజి ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలకు శాలూవాలతో సత్కరించారు. ఈ సమయంలో గొల్లపల్లి గ్రామ సర్పంచ్ బోయిని కృష్ణ, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, శివ్వంపేట కోశాధికారి బండారి గంగాధర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ శేఖర్, నాయకులు లక్ష్మీనర్సయ్య, పెద్ద నర్సింలు గ్రామస్తులు తదితరులున్నారు.

## అంబేద్కర్‌ను అవమానించినవారిని శిక్షించాలి

**బంట్వారం,జనవరి 19 (ప్రభాతవార్త) :** కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా కేంద్రంలోని కోతానూర్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల సరిహద్దు కుంచవరం గ్రామంలో వివిధ అంబేద్కర్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలతో శుద్ధి చేసి ఆరు ప్రసంగిస్తూ...ఈ నెల 22న మత దురహంకారులు కొందరు, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి అవమా నించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. భారత రాజ్యాంగం పట్ల గౌరవం లేని, చట్టాల పట్ల భయం లేని మూర్ఖులు మత విద్వే షాలను రెచ్చగొట్టేవారు ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నారని వా రు పేర్కొన్నారు. ఇలాంటివారిని తక్షణమే బంధించి కఠిమైన శిక్షలు విధించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తాహసిల్దార్ సుభాష్ కు అంద జేశారు. కుంచారం పరిసరాల గ్రామాలైన పోచారం, మొగ్దంపూర్, శివరాంపూర్ లక్ష్మాసాగర్, జిలవర్ష తదితర గ్రామాల అంబేద్కర్ యు వజన సంఘాలు, బుడగ జంగాలు, ముస్లిం మైనారిటీ తదితర సం ఘాల అధ్యక్షులు, కార్యదర్శులు అంతయ్య, సంజీవ్, బాబురావు, రఘువీర్, పురుషోత్తం, రవి, రంగయ్య, అర్జున్, గోరేమియా, మొ గులానా, కుమ్మరి నరసింహులు, టీ వెంకటేశం, మల్లేషం, బీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయం

**ఒకరిపై కేసు నమోదు**

**బంట్వారం,జనవరి 25 (ప్రభాతవార్త) :** గత ప్రభుత్వంలో ఏమో గాని న వాతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో సైతం విచ్చలవిడిగా బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామా ల్లో జోరుగా బెల్ట్ షాప్‌ల నిర్వాహకులు మద్యాన్ని భహిరంగంగా విక్రయిస్తున్నారు. గురువారం పోలీసులు నిర్వహించిన దాడులతో ఈ విషయం భహిర్గతమైంది. మండల కేంద్రంలోని వైన్స్ పక్కనె ఉన్నా ఓ బెల్ట్ షాపులో ఉదయం 6 గంటల న ండి మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నారన్నా విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకొని బెల్ట్ షాప్ నిర్వ హకుడిని విచారించారు. ఈ విచారణలో దుకాణంలో సుమారు 24 మద్యం బాటిల్స్ దొరికినట్లు ఎస్సై ఆనంద్ కుమార్ చెప్పారు. అయి తే అప్పటికే వివిధ రకాల మద్యం బాటిల్స్ విక్రయించినట్లు పేర్కొ న్నారు. దీంతో బెల్ట్ షాప్ నిర్వహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు. ఇక నుంచి బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిణ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## భక్తిశ్రద్ధలతో సీతారామ శోభాయాత్ర

**శంషాబాద్ జనవరి25,ప్రభాతవార్త :** శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ గ్రామంలో సీతారాముల కళ్యాణం అనంతరం శోభా యాత్రను నిర్వహించారు.అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష సందర్భంగా బుధవారం రాత్రి పెద్ద గోల్కొండ గ్రామంలో ప్రత్యేకంగా సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి బిసి మోర్చా కన్వీనర్ అనగోనే భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులందరి సమక్షం లో కళ్యాణ వేడులకను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో ఒడి బియ్యం వండి గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం స్వామివారి ,అమ్మవారి విగ్రహాలను భాజా భజంత్రీలతో టపాసులు పేలుస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు యు వతి ,యువకులు,గ్రామ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామసభల ద్వారా ఎంతో మేలు

**కాముని బాయి లక్ష్మయ్య**

**శంషాబాద్ జనవరి25,ప్రభాతవార్త :** గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధికి కావలసిన ప్రణాళికను రూపొందించుకోవడం ద్వారా గ్రామానికి ఎంతో మేలు జరుగుతుందని పెద్ద గోల్కొండ గ్రామ సర్పంచ్ కాముని బాయి లక్ష్మయ్య అన్నారు.సర్పంచ్ లక్ష్మయ్య అధ్య క్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు.రాబోయే రోజుల్లో ప్రభు త్వం ద్వారా వచ్చే నిధులతో గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి పను లపై గ్రామస్తులను అడిగి వివరాలు సేకరించారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్లు విద్యుత్ సమస్యలను గ్రామస్తులు వారి దృష్టికి తీసుకువచ్చారు.గ్రామంలో అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సర్పంచ్ కాముని బాయి లక్ష్మయ్య తెలిపారు.గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ ,బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో కార్య దర్శి సుజాత,ఎంపిటిసి సభ్యుడు యాదగిరి ,ఉప సర్పంచ్ అమృత గౌడ్,పంచాయతీ సభ్యులు మణెమ్మ,శ్రావణి పాండు రంగారెడ్డి, సురేష్ యాదవ్,కట్ట వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా తులసి మొక్క ఉండాలి : భాస్కర్ గౌడ్

**శంషాబాద్ జనవరి25,ప్రభాతవార్త :** ఆరోగ్యంతో పాటు ఐశ్వర్యాన్ని ప్రసాదించే తులసి మొక్క ప్రతి ఇంట్లో ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఓబిసి సెల్ కన్వీనర్ అనగోనే భాస్కర్ గౌడ్ అన్నారు.తులసి మొక్కతో కూడిన పూలకుండీలను ఆయన ప్రతి ఇంటికి బహుకరించారు.తులసి మొక్క ఇంట్లో ఉండడం శుభసూచి కమని ప్రతి ఇంట్లో దీనిని తప్పకుండా పెంచుకోవాలని అన్నారు.అనేక రకాల ఔషద గుణాలు కలిగి ఈ మొక్క ద్వారా లక్ష్మీ కటాక్షం కూడా లభిస్తుందని భాస్కర్ గౌడ్ సూచించారు.ప్రతి ఇంటికి మేలు చేసే ఇలాంటి మొక్కలు ప్రతి ఇంట్లో ఉండాలనే ఉద్దేశంతో దాదాపు 400తులసి కుండీలను గ్రామంలో ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.తులసి కుండీలు రానివారు ఉంటే తనను సం ప్రదించాలని అనగోనే భాస్కర్ గౌడ్ సూచించారు.

## 3 కిలోల ఎండు గంజాయి పట్టివేత

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 25, ప్రభాత వార్త:** ఓ ఇంటిలో ఐదు లక్షల విలువ గల మూడు కిలోల ఎండు గంజాయిని పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్య కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు మేడిపల్లి మండలం బొల్లిగూడ సూర జ్‌నగర్ కాలనీలోని ఓ ఇంటిపై పోలీసులు దాడిచేసి సోదాచేయగా రెండు కిలోల ఎండు గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. అదే ఇంటిముందు పార్కుచేసి ఉన్న స్కూటీని తనిఖీ చేయగా అందులో నుండి కిలో ఎండు గంజాయితో పాటు మొత్తం 3 కిలోల గంజాయి లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఇంటిలో గంజాయి నిల్వఉంచి అక్రమార్జనకు పాల్పడుతున్న బంగా రి సాయికుమార్ ( 19 ) విచారించగా ఒరిస్సా ప్రాంతం నుండి గంజాయిని ఇక్కడకు తీసుకువచ్చి ఇక్కడి కళాశాల విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇతనికి సహకరించిన నాగారం మున్సిపల్‌లోని ఎస్వీనగర్‌కు చెందిన కర్రి శివాజీ ( 23 ) అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇరువురి నిందితుల నుండి మూడు కిలోల గంజాయితో పాటు స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో సీఐ మల్లయ్యతో పాటు ఎస్సైలు పురుషోత్తం రెడ్డి, శ్రావణిలు పాల్గొన్నట్లు తెలిపారు.

## పదేళ్ల కాలం ఎంతో అనుభవం ఇచ్చింది : సర్పంచ్

**దోమ.జనవరి 25 ప్రభాతవార్త.** పదెళ్ళ సర్పంచ్ పదవి కాలంలో ఎంతో అనుభంను ఇచ్చిందని దోమ సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు.సర్పంచ్ పదెళ్ళ కాలం ముగిసిన సందర్బముగ గురవారం నాడు దోమ గ్రామ పంచాయతీ కార్యాలయములో వార్డు సభ్యులతో సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూప్రభుత్వం నుండి గ్రామపంచాయతీకి నిదులు సక్రమంగా రాలేనందున అబివృ ద్దిలో కొంత జాప్యం జరిగిందని అన్నారు.గ్రామ ప్రజలకు సక్రమంగా తాగు నీరు అందించామని,వీదిలైట్లు ఏర్పాటు చేయడంతో పాటు,ఇంటి నుం డిట్రాక్టర్ల ద్వారా చెత్తసేకరణ చేపట్టి గ్రామాన్ని అబివృద్ధి పరిచా మని అన్నారు.ఈ సందర్భముగ పాలక వర్గంకుసన్మాన కార్యక్రమము త్వరలో చేపట్టుతామని అన్నారు. ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్,వార్డు మెంబర్లువసంత్‌రావు, నిరోషా,లక్ష్మన్, రమేశ్,గౌస్, వెంకటయ్య, పాల్గోన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

## ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గొప్పది

**జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్**

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో గొప్పదని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. గురువారం 14వ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని కొండ భూదేవి గార్డెన్‌లో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవం జరుపుకోవడం ద్వార ప్రజలకు ఓటు ప్రముఖ్యతను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో రమేష్ బాబు, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం వారు సీనియర్ సిటీజన్లను సన్మానించి, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

**హుస్నాబాద్‌లో...**

14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర పాఠశాల నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, క్విజ్, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో డిటి దేవేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార మార్పిడి ఓటు హక్కుతోనే సాధ్యం : ఆర్డీవో




మాట్లాడుతున్న ఆర్డీఓ బన్సిలాల్

**గజ్వేల్ టౌన్, జనవరి 25 (ప్రభాతవార్త):** ఒక్క రక్తం బొట్టు చిందించకుండా అధికార మార్పిడి ఓటు హక్కును వినియోగించడం ద్వారానే సాధ్యమవుతుందని గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్ అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని బాలుర విద్యా సౌధంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బన్సిలాల్ మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి పౌరుడు కనీస బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, పట్టణాల్లో అందుకు భిన్నంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి వారి వారి గ్రామాల్లో మార్గదర్శకులుగా మారి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి, డాక్టర్ రమేష్‌బాబు, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎం.భవాని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ పెద్దిరాజు, మార్కండేయ, ఓంప్రకాష్, విష్ణు, లక్ష్మినర్సయ్య, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :** పద్దెనిమిదేళ్లు నిండిన యువత ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దూలం రవీందర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి, మతం, కులం, మద్యం, డబ్బుతో పాటు భాషకు సంబంధించిన ప్రలోభాలకు గురై తమ ఓటును వృధా చేసుకోద్దన్నారు. ఈ ప్రలోభాలవల్ల సమాజానికి సరైన న్యాయం చేసేవారు ఉపయోగపడేవారిని కనుమరుగు చేసుకోవద్దని హితవు చెప్పారు. దేశభిశ్యత్తు యువత చేతుల్లోనే ఉందని మరవకుండా సరైన నాయకుడిని ఎన్నుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దామెర కరుణాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృధం సదానందం, లక్ష్మయ్య, నిర్మలదేవి, సంపత్, కవిత, స్వరూప, కవిత పాల్గొన్నారు.

## మాసాయిపేటలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, అధికారులు, విద్యార్థుఉ

**వెల్దుర్తి, జనవరి25 ప్రభాతవార్త:** మాసాయిపేటలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వృద్ధ ఓటర్లను సర్పంచి మధుసూదన్‌రెడ్డి, తహశీల్దార్ నాగజ్యోతి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దన్‌సింగ్, బొమ్మారం సర్పంచి శంకర్, ఉప సర్పంచి నాగరాజు, ఉపాధ్యాయులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తిలో...**

మండల కేంద్రమైన వెల్దుర్తిలో విద్యార్థులు భారత ఎన్నికల సంఘం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహశీల్దార్ తులసీరామ్, ఎస్ఐ మధుసూదన్‌గౌడ్, ప్రధానోపధ్యాయులు సాంబయ్య, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో బిఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్ ప్రారంభం

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 25, ప్రభాతవార్త:** సంగారెడ్డిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఐబిఎస్ స్టాండర్డ్స్ క్లబ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐబిఎస్ స్లాండర్డ్స్ ప్రొమోషన్ అధికారి అభిసాయి మాట్లాడుతూ విద్యార్థులకు ఐఎస్ఐ మార్కు మొక్క అవశ్యకతను, కేర్‌యాప్, బిఐఎస్ గురించి వివరించారు. ఐబిఎస్ వెబ్సైట్‌పై అవగాహన కల్పించారు. నగలపై ఉన్న హాల్మార్క్ మరియు పలు వస్తువులపై ముద్రితమై ఐండస్ స్టాండర్డ్స్ యొక్క విశ్వసనీయత ఐబిఎస్ కేర్ యాప్, బిఐఎస్ వెబ్‌సైట్‌ల ద్వార ఏ విధంగా నిర్ధారించుకోవచ్చని వివరించారు. బిఐఎస్ స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రభాకర్ విద్యార్థులకు స్లాండర్స్ రైటింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

# యాసంగి సాగుకు నీటి విడుదల

**దేవాదాయ,అటవీశాఖ మంత్రి కొండా సురేఖ**

**మిరుదొడ్డి, జనవరి 25, ప్రభాతవార్త**

దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట, మిరుదొడ్డి మండలాలలో గురువారం దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండ సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా తోగుట మండలం తుక్కాపూర్ వద్ద ఉన్న మల్లన్న సాగర్‌పంప్‌హౌజ్ నుండి కాల్వల ద్వార సాగునీటిని విడుదల చేశారు. యాసంగిలో పంటలు సాగుచేసుకునే రైతులకు ఇంబ్బందులు లేకుండా ముందస్తు నీరు విడుదల చేశారు. దీంతో నియోజకవర్గంలోని పలు మండలాలలోని గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. వారం రోజుల క్రితం రైతులకు సాగునీటిని విడుదల చేయాలని దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలి



పంచాయత కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

పారని, రైతుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి మంత్రిగా తన సహకారం ఎప్పటికి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల విషయంలో ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందవద్దని కచ్చితంగా హామీలు అమలు చేసి తీరుతామన్నారు. అనంతరం తొగుట మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, రైతు వేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కూరగాయల మార్కెట్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సి హరేరాం, ఈఈ సాయిబాబా, డిఈఈ శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిపేట కాంగ్రెస్ ఇంచార్జ్ హరికృష్ణ, ఎంపిపి లతానరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు స్వామి, సర్పంచ్ కొండల్‌రెడ్డి, మిరుదొడ్డి పార్టీ మండల అధ్యక్షులు రాజేశం, అల్వాల సర్పంచ్ కృష్ణయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌డిఓ కౌసల్యాదేవి

## సామాజిక తనిఖీలో రూ.63వేల రికవరీ

**ములుగు, జనవరి 25 (ప్రభాతవార్త):** మండలకేంద్రమైన ములుగు రైతు వేదిక వద్ద గురువారం మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 14వ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఆర్‌డిఓ కౌసల్యాదేవి, ఎంపిడిఓ వెంకటేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలలో జరిగిన పనుల్లో అవకతవకలను గుర్తించి వాటికి సంబంధించిన సుమారు రూ.63వేలు రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిడిలు ఓబులేష్, సతీష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అణచివేత ధోరణిని అవలంబిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**బిజెపి రాష్ట్ర మహిళా నాయకురాలు అశ్విని శ్రీనివాస్**

**రామాయంపేట, జనవరి 25, ప్రభాతవార్త :** అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విషయాన్ని తప్పుపడుతూ విద్యార్థి సంఘాల నాయకులు నిరసనలు తెలియజేస్తున్న సమయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ యువతిని(ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ) నడిరోడ్డు మీద జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి కింద పడేయడం మహిళా జాతిని అవమానించినట్టే అని బిజెపి రాష్ట్ర మహిళా నాయకురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్ అన్నారు. గత ప్రభుత్వంలో యూనివర్సిటీ భూములను గుంజుకునే ప్రయత్నం చేయంగా, అదే ధోరణిని ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసే క్రమంలో హైకోర్టుకు స్థల కేటాయింపులో యూనివర్సిటీ భూములే తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాదు నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో వందలాది ఎకరాల భూములు ఉన్నాయని, మరెక్కడైన హైకోర్టుకు స్థలం కేటాయించాలన్నారు. ఇప్పటికైనా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే యూనివర్సిటీ భూములను ప్రభుత్వం కాపాడాలని ఆమె కోరారు. యువతిని జుట్టు పట్టుకొని తీసుకెళ్లిన పోలీసులను తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులకు మద్దతుగా నిలిచి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాని హెచ్చరించారు. ధర్నా చౌకుని కొనసాగిస్తామని, ప్రజలు వారికి ఎదురయ్యే సమస్యల మీద ధర్నాలు చేసుకోవచ్చిని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం రెండు నెలలు గడవకముందే ఇలాంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. ఇకనైనా పోలీస్ శాఖ ఇలాంటి తొందరపాటు చర్యలకు దిగే పోలీసులను కట్టడి చేయాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

## పోలీసుల తీరును ఖండిస్తున్నాం

**ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు శశికాంత్**

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 25, ప్రభాతవార్త :** విద్యార్థి నాయకులపై అణిచివేత ధోరణిని అవలంబిస్తున్న పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు శశికాంత్ అన్నారు. గురువారం స్థానిక భారతమాత మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడాన్ని తప్పుపడుతూ, వెంటనే జీవో 55ని రద్దు చేయాలని విద్యార్థులు నిరసన తెలుపుతుండగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టుపట్టుకుని లాగిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్రెండ్లీ పోలీసులను మెయింటైన్ చేస్తామని, ధర్నా చౌకును ఎత్తివేయమని, నిరసనలు తెలియజేసుకోవచ్చని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నెలలు గడవకముందే ఆడపిల్లలని చూడకుండా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిని ఈడ్చు కెళ్లడం స్త్రీ జాతిని అవమానపరిచినట్లే అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యార్థులకు అండగా నిలబడుతున్నవంటి ఏబీవీపీ నాయకుల మీద దురుసుగా ప్రవర్తించడం హేయమైన చర్య అని ఆయన అన్నారు. ఇట్టి చర్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని, అలాగే రాష్ట్రంలో ఉన్న మహిళామంత్రులుగా ఉన్నవారు కూడా దీనిమీద స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీ కేంద్రాలలో, జిల్లా కేంద్రాలలో, ప్రతి ఒక్క మండల కేంద్రంలో ఉద్యమ కార్యచరణ చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, నాయకులు నరేష్, వంశీ, సాయి, రాహుల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శశికాంత్



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**వెల్దుర్తి, జనవరి25 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుకునూరు గ్రామంలో నూతనంగా రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆమె, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచి ప్రీతి మహేందర్‌రెడ్డి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పంచాయితీ కార్యాలయం పరిసరాల్లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ డిప్యూటీ ఈఈ రాధిక లక్ష్మీ, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, వైస్ చైర్మన్ మురళి, తహశీల్దార్ తులసీరాం, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, సర్పంచులు మల్లేశం, శేఖర్, శంకర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌కు ఘనసన్మానం

**రామాయంపేట, జనవరి 25, ప్రభాతవార్త:** ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చెందిన సంఘ సేవకుడు వెంకుగారి రాజిరెడ్డి గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును కలిశారు. మెదక్ ఎమ్మెల్యేగా రోహిత్ గెలుపొందిన తర్వాత ఆయనను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, రాజిరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్. వెంకటాపూర్ గ్రామ అభివృద్ధి పై వారు చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హామీ ఇచ్చినట్లు రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకుగారి విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**- కుట్టుమిషన్లు అందించిన జిల్లా కలెక్టర్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 25, ప్రభాతవార్త:** స్టేట్ బ్యాంక్ కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎర్ఆర్)లో భాగంగా పట్టణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పొందిన 50 మంది మహిళలకు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి కుట్టు మిషన్లు పంపిణి చేశారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌సిటి లో ఇస్తున్న శిక్షణలు మహిళలకు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. మహిళలు వేసిన మగ్గం పనులను కలెక్టర్ పరిశీలించారు. మహిళల్లో ఎంతో ఓపిక, క్రమ శిక్షణ, శక్తి ఉంటుందని, ఏ సమస్యలు వచ్చిన పరిష్కరించేందుకు కృషి చేస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. అవసరమైనవారికి రుణసదుపాయం కల్పిస్తామని బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్‌రావు, సంగారెడ్డి రెవిన్యూ డివిజన్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, ఆర్‌సిటి డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్, శిక్షకులు శివశంకర్, నర్సింలు, ప్రశాంతి పాల్గొన్నారు.

## సామూహిక పండగ ఓటరు దినోత్సవం

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 25, ప్రభాతవార్త:**

కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు జరుపుకునే పండగ ఓటరు దినోత్సవమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 14వ ఓటరు దినోవ్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఉన్న వారు ఎన్నికల్లో తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కుతో కలిగే ప్రయోజనాలపై జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి వివరించారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు, సీనియర్ ఓటర్లకు, యువ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. బిఎల్‌ఓలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, డిఆర్‌ఓ, జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రఘునందన్‌రావు నోరు అదుపులో పెట్టుకోవాలి

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

**తోగుట, జనవరి 25,ప్రభాతవార్త**

కాంగ్రెస్ నాయకులు మాటలు మాట్లాడడమే కాదు పనులు చేసి చూపించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తోగుట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో బొక్కబోర్ల పడ్డ రఘునందన్‌రావుకు ఇప్పటికి బుద్ధి రాలేదని, నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించబోమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఓటమి ఎరుగని నేత హరీష్‌రావుపై ప్రేలాపణలు చేయడం సరికాదన్నారు. ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిసిన రఘునందన్‌రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏం చేశారని ప్రశ్నించారు. తాను ఎంపిగా ఉన్నప్పుడు ఏం చేశానో చూసి, ఏం మాట్లాడాలో ఆలోచించుకోవాలన్నారు. ఇటీవల వారు సిఎం రేవంత్‌రెడ్డిని కలిస్తే నానా రాద్దాంతం చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రా లేక రాష్ట్రానికి ముఖ్యమంత్రా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులను ఎన్నిసార్లయినా కలుస్తామన్నారు. అదే సిఎం రేవంత్ ప్రధానమంత్రి మోడీని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కలిసినప్పుడు మీ నోర్ల మూసుకుపోయాయా అని ప్రశ్నించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఉద్యమాలకు అడ్డాఅని ఎంపి ఎన్నికల్లో సైతం మెదక్‌లో గులాబి జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ నాయకుల్లో మాటల్లో కాకుండా చేతల్లో తమ పనులు చూపించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పుణ్యమా ఈ ప్రాంతంలో మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టులు నిర్మాణం చేయడంతో సాగునీటి కష్టాలు తొలిగిపోయిన విషయం గుర్తు చేశారు.

**అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే...**

మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భవనం, లింగంపేటలో వాటర్‌ప్లాంట్, ఎల్లారెడ్డిపేటలో గ్రామ పంచాయతీ భవనం పెద్దమసాన్‌పల్లిలో గ్రామ పంచాయతీ, వాటర్‌ట్యాంక్, రైతు వేదిక భవనాలుతో పాటు ముదిరాజ్ సంఘం భవనాలను వర్ధరాజ్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనం, ముదిరాజ్ సంఘ భవనాలు, గుడికందులలో ఎన్సికమ్యూనటిహాల్, గౌడ సంఘంతో పాటు మురికి కావువల నిర్మాణాలతోపాటు పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి భవనాల పనులు ప్రారంభించారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## 31న గద్దర్ విగ్రహావిష్కరణ

**రామచంద్రాపురం, జనవరి 25, ప్రభాతవార్త:** ఈ నెల 31న ప్రజా యుద్ధ నకౌక, దివంగత గద్దర్ జయంతిని పురస్కరించుకుని తెల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని ఇందిరా నగర్ చౌరస్తాలో గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ప్రజా యుద్వ నౌక, గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య , తెల్లాపూర్ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌లు తెలిపారు. గురువారం గద్దర్ విగ్రహావిష్వరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాలు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు కుమార్ గౌడ్, బాలయ్య, మల్లేపల్లి బుచ్చిరెడ్డి, దేవేందర్ యాదవ్, పసునూరి రవీందర్, అరుణ్ గౌడ్, అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఓటరు దినోత్సవ ర్యాలీ




సంగారెడ్డిలో ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

**సంగారెడ్డి టౌన్, జనవరి 25, ప్రభాతవార్త:** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలిని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి జండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఉన్న వారు విధిగా ఎన్నికల్లో తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటుతో కలిగే ప్రయోజనాలపై ఎస్పి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్‌డిఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**పాపన్నపేటలో...**



పాపన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

**పాపన్నపేట, జనవరి 25, ప్రభాతవార్త:** ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుదం అని తహసీల్దార్ లక్ష్మన్ బాబు సూచించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పాపన్నపేటలో విద్యార్థులతో లిసి ఓటరు ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా అధికారులు విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేయించారు. ఓటుతో కలిగే ప్రయోజనాలపై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి25 ప్రభాతవార్త:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ ఓటును నమోదుచేసుకోవాలని తహశీల్దార్ గఫార్‌మియా అన్నారు. గురువారం కొల్చారంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని బస్టాండ్ నుంచి పురవీధుల గుండా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయితీ వద్ద ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ గఫార్ మియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమైన ఓటును ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, అలాగే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ ప్రభాకర్, కారోబార్ వడ్ల ప్రభాకర్, ఉప సర్పంచి చెన్నయ్య, గ్రామకార్యదర్శి అంజయ్య, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్

**జహీరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** ఈ నెల 26వ తారీఖు నుంచి ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టౌర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన నివాసంలో క్రికెట్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవంను పురస్కరించుకుని 26న ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ నుంచి బాగారెడ్డి స్టేడియం వరకు తిరంగ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మొదటి రోజైన శుక్రవారం న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్‌లో, 28న జహీరాబాద్ మండలం, పట్టణం, ఝరాసంగం మండలాలు, 29న మొగుడంపల్లి, కోహీర్ మండలాల్లో క్రికెట్ టౌర్నమెంట్‌లు నిర్వహిస్తామన్నారు. చివరగా నియోజకవర్గ స్థాయిలో జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో టోర్నీ ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. టోర్నీ విజేతకు 2 లక్షలు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు 1లక్ష రూపాయలు, ట్రోఫీని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అధ్యక్షులు నారాయణరెడ్డి, నాయకులు బి శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల భాస్కర్, శుక్లవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్, న్యాయవాది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి



మునిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

## ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**మునిపల్లి, జనవరి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని అధికారులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని రెవెన్యూ కార్యాలయం నుంచి గ్రామ పంచాయతీ వరకు అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం విద్యార్థులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తెన్మోలి, డిప్యూటీ తహసీల్దార్ కృపానందం, ఎంపిడిఓ నందన్‌రావు, ఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ దశరథ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**చౌటకూరులో...**



చౌటకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

**చౌటకూరు, జనవరి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం 14వ జాతీయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని రెవిన్యూ కార్యాలయం నుంచి ఉదయం విద్యార్థులు అధికారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలని తహసీల్దార్ ఈశ్వరరాయ్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరమణి మొగులప్ప, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, ఆర్ఐ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటును నమోదు చేసుకోవాలి

**-బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావర అంజిరెడ్డి**



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

**సదాశివపేట, జనవరి 25, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావిరి అంజిరెడ్డి అన్నారు. గురువారం వైఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పురుమాండ్ల పవన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఓటర్ల సమ్మేళన కార్యక్రమంలో గోదావరి అంజిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ ఇంచార్జి పులిమామిడి రాజు, కన్వీనర్ పోచారం రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్‌రావు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రాకేష్, రాజశేఖర్, ముత్తిరెడ్డి, ఉపాధ్యక్షులు సందీప్, కన్వీనర్ ప్రవీణ్, నాయకులు శివశంకర్‌రెడ్డి, మణికంఠ, ఆదిత్య, నక్కల శ్రీనివాస్, పిట్టల రమేష్, రాములు, సుధాకర్, పిఎంఆర్ యువసేల అధ్యక్షులు కర్చర్ల హరీష్ కుమార్, అనిల్, గుణాకర్, భువన్ పాటిల్, చిన్న, టి రామన్న, వెంటక్, సోమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన బూత్ లెవల్ కన్వీనర్లు



హైదరాబాద్‌కు తరలుతున్న మండల బూత్ లెవల్ కన్వీనర్లు

**పుల్కల్, జనవరి 25, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గురువారం జరిగే కాంగ్రెస్ బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణా తరగతులకు మండలంలోని ఆయా గ్రామాల బూత్ కన్వీనర్‌లు తరలివెళ్లారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గరెడ్డి జండా ఊపి కన్వీనర్‌లను సాగనంపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, గోవర్ధన్, కమల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు రవీందర్, గణపతి, నర్సింలు, ప్రభు, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజోజిపేటలో సిసి కెమెరాలను ప్రారంభించిన డిఎస్‌పి

**పుల్కల్, జనవరి 25, ప్రభాతవార్త:** మండలంలోని గంజోజిపేటలో ఫస్ట్ మీస్ట్ ప్రైవేటు లిమిటెడ్ కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్ యం నగరాజ్ రెడ్డి అందచేసిన 22 సిసి కెమెరాలను డిఎస్‌పి రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని, నేరాల అదుపుకు సిసి కెమెరాలు దోహదపడుతున్నాయన్నారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలనేర్పాట చేసుకునేందుకు తమ వంతు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని డిఎస్‌పి సూచించారు. గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించిన నటరాజ్ రెడ్డిని డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సిఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతి కుమార్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యా కమిటి చైర్మన్ కె అశోక్ వార్డు సభ్యులు, యువజన సంఘాల బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రమేష్ కుమార్

# బిఆర్ఎస్ హయాంలోనే మోతిమాత ఆలయం అభివృద్ధి

### జాతర ఉత్సవాల్లో ఎంపి, ఎమ్మెల్యే

**జహీరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌హయాంలోనే మొగుడంపల్లి మండలంలోని ఉప్పరపల్లలోని మోతిమాత ఆలయం అభివృద్ధి సాధించిందని ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. జాతరను పురస్కరించుకుని ఉత్సవాలకు హాజరైన ఎంపి, ఎమ్మెల్యేలను నిర్వాహకులు పూలబొకేలను అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎంపి, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు గతంలో ఆలయాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిఎస్ ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం, బిఆర్ఎస్ పార్టీ మండ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం జడ్పీటిసి సభ్యులు వినీల నరేష్, సొసైటీ చైర్మన్ మచ్చందర్, మాజా ప్రజాప్రతిధులు, నాయకులు మోతిరామ్, గోవర్ధన్‌రెడ్డి, శంకర్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌శెట్టి, గోపాల్ భానోత్, హీరు రాథోడ్, కార్యదర్శి దేవిదాస్, ఎంపిటిసి చందు జాదవ్, కేశు సింగ్, ఖీరు, శేఖర్, రూప్‌సింగ్, చందర్, సంజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి బిబి పాటిల్

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్**

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో నమోనమో నవ మతదాత అభియాన్‌లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోడీ లైవ్ ప్రసారం చేయడం జరిగింది. ఇందులో ప్రధానమంత్రి మోడీ యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పడం జరిగింది. యువత కలలు సాకారం కావాలంటే కుటుంబ పార్టీల వల్ల సాధ్యం కాదని, బీజేపీ వల్లే సాధ్యమవుతుందన్నారు. యువత అందరూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కుటంబ పార్టీలను పక్కన పెట్టి దేశం కోసం, ధర్మం కోసం ఎవరైతే పనిచేస్తున్నారో ఆ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఏ ప్రభుత్వాన్ని అయినా అధికారంలోకి తీసుకురాగల సత్తా యువతకు ఉందని, తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఉదయ్‌కిరణ్, బీజేపీ అభ్యర్థి పంజా విజయ్, ప్రధాన కార్యదర్శులు విజయ్, సుధాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, రాగి రాములు, మండల అధ్యక్షులు ప్రసాద్, ప్రభాకర్, రాజు, దయానంద్‌రెడ్డి, సంతోష్‌చారి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

**పెద్దశంకరంపేట, జనవరి 25 ప్రభాతవార్త:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా ఓటును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు కలిగిన వారందరూ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని తహశీల్దార్ గ్రేసీబాయి సూచించారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉంటామని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరణప్ప, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**శివ్వంపేట మండలంలో...**



మాట్లాడుతున్న విద్యార్థిని

**శివ్వంపేట, జనవరి 25 ప్రభాతవార్త:** మండలంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది. తహశీల్దార్ శ్రీనివాస్‌చారి, ఆర్ఐ కిషన్‌ల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా చండి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఓటర్ల ప్రతిజ్ఞ, స్కిట్లు, డ్యాన్స్, ఉపాన్యాస కార్యక్రమాలతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓట్లు వేసేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు సంతోషనకుమార్ మాట్లాడుతూ 2011 నుండి జనవరి 25న ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాస్తుల వామనశర్మ, విజయేందర్‌రెడ్డి, హేమలత తదితరులు పాల్గొన్నారు. ఓడిపోనీయకు నీ ఓటును అనే పాటకు 12వ తరగతి విద్యార్థిని హరిత డ్యాన్స్ అలరించడం జరిగింది.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొండపాక, జనవరి 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్పడ్గ గ్రామానికి చెందిన గాదగోని రాజారాం గౌడ్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి స్థానిక నాయకులతో రూ॥ 5 వేలు ఆర్థికసహాయం పంపించగా వారు మృతుని కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఎంపిటీసీ పత్తి అంజనేయులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబనికి చెందిన రాజారాం గౌడ్ కుటుంబాన్ని ఆర్థికంగా అదుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దర్గా సాయిగౌడ్, అంబటి మల్లేశం గౌడ్, నేతి సురేష్, దున్న చందు, కోల కిష్టయ్య, శ్రీనివాస్, కార్తిక్ పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించినవారిని శిక్షించాలి

**-సమతాసైనిక్ దళ్ నాయకులు**

**జహీరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలో ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానంచి దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని సమతా సైనిక్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐబి నుంచి అంబేద్కఅన విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌కు పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సమతా సైనిక్ దళ్ నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కొరకు బ్రిటీష్ వారు నిర్వహించిన మూడు రౌండ్ టేబుల్ సామావేశాల్లో పాల్గొన్న ఏకైక వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ అని, అలాంటి మహనీయుడిని అవమానించడం మూర్ఖత్వం అని, అవమానించిన వ్యక్తులు వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ సైనికులు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జహీరాబాద్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



పట్టణంలో నిరసనర్యాలీ నిర్వహిస్తున్న సమతా సైనిక్ దళ్ నాయకులు



ఎల్‌బి స్టేడియం సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్

### ఎల్‌బి స్టేడియం.. సమావేశంలో పాల్గొన్న సతీష్

**మునిపల్లి, జనవరి 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సతీస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఎల్‌బి స్టేడియంలో ఏఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొని పార్టీకి దిశ నిర్దేశం చేశారని సతీస్ పేర్కొన్నారు.

### వరి నాడుమడులను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**పుల్కల్, జనవరి 25, ప్రభాతవార్త:** వరి పంటలను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని చౌటకూరు, తాడ్‌దన్‌పల్లి, గొంగ్లూర్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశోధన స్థానం శాస్త్రవేత్లలు వై చంద్రమోహన్, టి కిరణ్, ఏరువాలక కేంద్రం సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ, సరితలు మాట్లాడుతూ రైతులు పలు రకాల వరి పంటలను సాగుచేసుకుంటున్నట్లు గుర్తించామన్నారు. పంట ఎర్రబారకుండా మ్లాంకోజుబ్ టి కార్పొండిజమ్‌తోపాటు ఒక కిలో యూరియాలో కలిపి పంటకు పిచికారి చేయాలన్నారు. కాండం తొలిచేపురుగు నివారణకు కార్పోఫురాన్ 3 గ్రాములు ఎకరాకు 10 కిలోలు వినియోగించాలన్నారు. పంటల అధిక దిగుబడులకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చైతన్య, ఏఈఓ మనీషా, రైతులు పాల్గొన్నారు.

## స్థితిగతులను మార్చేది ఓటు మాత్రమే

**మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సమాజ స్థితిగతులను మార్చే శక్తి ఒక్క ఓటు హక్కుకే ఉందని బిజెపి సీనియర్ నాయకులు, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిజెపి యువ మోర్చ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రధాని విడియో సందేశం ద్వార వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు సురేష్‌గౌడ్, నాయకులు మార్కండేయ, సంతోష్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, కళ్యాణ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌తో పాటు ఎబివిపి నాయకులు పాల్గొన్నారు.

### బూత్ లెవల్ సమావేశానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**



బూత్ లెవల్ సమావేశానికి తరలిన నాయకుల దృశ్యం

హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన బూత్ లెవల్ ఏజెంట్‌ల సమావేశానికి సిద్దిపేట నుండి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సిద్దిపేట నియోజక వర్గ ఇంచార్జీ పూసాల హరికృష్ణ, బొమ్మల యాదగిరి, అంజిరెడ్డి, నాయిని నరసింహారెడ్డి, కలీమొద్దిన్, రాజనరేందర్, రాజబహదూర్, మల్లారెడ్డి, రాములు, కనుకయ్య, శ్రీనివాస్, మల్లేశం తదితరులు ఉన్నారు.

### ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కడం హర్షణీయం

**యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సర్దార్‌ఖాన్**

**గజ్వేల్ టౌన్, జనవరి 25 (ప్రభాతవార్త):** తెలంగాణ వచ్చిన పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ హయాంలో ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కడం హర్షణీయమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమకారులను ఏకతాటిపైకి తెచ్చి ఎన్నో ఉద్యమాలను నడిపిన టిఎస్‌జేఏసి చైర్మన్ కోదండరాంతో పాటు పత్రికా రంగంలో ఎన్నో సేవలు అందించిన మీర్ అమీర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకం కావడం సంతోషంగా ఉందన్నారు. కొన్ని పార్టీలు ఉద్యమ పార్టీలు అని చెప్పుకొని రాజకీయాలు చేయడం తప్ప ఉద్యమకారులను గౌరవించలేదన్నారు. కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్‌ల నియామకానికి ప్రతిపాదించిన సిఎం రేవంత్‌రెడ్డి, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

**వర్గల్, జనవరి 25 (ప్రభాతవార్త):** అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్గల్ మండలంలోని శేరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం శేరిపల్లి గ్రామానికి చెందిన బోయిని ప్రభాకర్(35) గత మూడు సంవత్సరాల క్రితం ఫైనాన్స్‌లో ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఫైనాన్స్‌కు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో ఇటీవల ఫైనాన్స్ వారు ట్రాక్టర్‌ను తీసుకెళ్ళారు. దీంతో మరిన్ని అప్పులు కావడంతో ప్రభాకర్ మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో మద్యం కోసం ఇంట్లో ఉన్న బియ్యం విక్రయించడంతో అతని భార్య శ్యామల ప్రభాకర్‌ల మధ్య గొడవ అయ్యింది. దీంతో ప్రభాకర్ శ్యామలను కొట్టి ఇంటి నుండి పంపించాడు. జీవితంపై విరక్తి చెందిన ప్రభాకర్ మద్యం మత్తులో వ్యవసాయ పొలం వద్ద పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గౌరారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య శ్యామలతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మల్లయోధుడికి కడియం బహుకరిస్తున్న ఎస్ఐ రామునాయుడు

### రత్నాపూర్‌లో ఘనంగా మహబూబ్ సుభాని జాతర

**న్యాల్‌కల్, జనవరి 25, ప్రభాతవార్త:** జాతర ఉర్సు ఉత్సవాలు తెలంగాణ మిశ్రమ సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయని ఎస్ఐ రాము నాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలో మహబూబ్ సుభాని ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని జాతర ఆవరణలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటిన మల్లయోధులకు బహుమతులు అందచేశారరు. ఫైనల్ పోటీలో గెలుపొందిన ఉద్గీర్‌కు చెందిన కుతుబ్‌కు వెండి కడియం బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామునాయుడు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఉర్సులో పాల్గొనడం మతసామరస్యానికి ప్రతీకంగా నిలుస్తాయన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవికుమార్, మాజీ ఎంపిటిసి సభ్యులు శాంత్‌కుమార్ పాటిల్, శ్రీరామ్ ప్రజా సేవ అధ్యక్షులు జనార్ధన్‌గౌడ్, సురేందర్, జెనుద్దీన్, షబ్బీర్, అహ్మద్, చాకలి శివకుమార్, శ్రీను, హన్మంత్, సంజు, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లుపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

**శివ్వంపేట, జనవరి 25 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలంతో పాటు వివిధ మండలాల్లోనూ ప్రజలకు సేవలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త సంకల్పం చాలా గొప్పదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మల్లుపల్లి గ్రామంలో మహేష్‌గుప్త సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. జెడ్పీటీసీ మహేష్‌గుప్త అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, స్థానిక సర్పంచి గ్యాదరి భాగ్యమ్మ, నాయకులు లాయక్, కొత్తపేట యాదాగౌడ్, ఆకుల శ్రీనివాస్, పవన్‌గుప్త, పిట్ల సత్యనారాయణ, నర్సింహారెడ్డి, రాజేందర్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి, బోళ్ల ఆంజనేయులు, భాస్కర్ నాయక్, గ్యాదరి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### రొండ మల్లారెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

**శివ్వంపేట, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రొండ మల్లారెడ్డిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గురువారం ప్రత్యేకంగా కలిసి అభినందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని డాక్టర్ రొండ మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోట్లాది సొంత డబ్బులతో శ్రీహరిహరనందన అయ్యప్పస్వామి దేవాలయం నిర్మించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ మలారెడ్డిని సునీతా లక్ష్మారెడ్డి, మదన్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు. నేటి కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, నాయకులు గొరె వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, వ్యాపారవేత్త శంతన్‌గుప్త ఉన్నారు.

### శ్రీభగళాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

**శివ్వంపేట, జనవరి25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నెలకొల్పిన శ్రీ భగళాముఖి అమ్మవారి శక్తిపీఠంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ పర్వదినాన వివిధప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. శక్తిపీఠం ఉపాసకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు కలగజేశారు. భగళాముఖి ట్రస్టు సభ్యులు, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ ఏర్పాటు చేయడం జరిగింది. మాజీ సర్పంచి పబ్బా రమేష్‌గుప్త పూజా ఏర్పాట్లతో పాటు పలువురు ముఖ్యులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, సర్పంచి పి. శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచి రాజిపేట పద్మ వెంకటేష్, యువ న్యాయవాదులు వజ్జ హనుమంతు, వజ్జ సాయికిరణ్, సూర్యకుమార్‌గౌడ్, ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, రాజు, భాసంపల్లి కృష్ణాగౌడ్, వార్డు సభ్యులు పోచాగౌడ్, వంజరి కొండల్, జ్యోతి సింహం తదితరులు ఉన్నారు.

### బీజేవైఎం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం



ఓటరు దినోత్సవంలో మాట్లాడుతునన బీజేవైఎం నాయకులు

**జహీరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నరేంద్ర మోది నమో నవ మత్ దాత కార్యక్రమాన్ని పట్టణంలోని బసవా ఫంక్షన్ హాల్‌లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కును పొందిన యువకులు నరేంద్రమోదికి మద్దతు తెలిపేలా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి సోమా అనిల్, అసెంబ్లీ కన్వీనర్ నరేష్ పాటిల్, పట్టణ అధ్యక్షులు రూపేష్, ప్రధానకార్యదర్శి గురు, మండల అధ్యక్షులు బంటు విశ్వనాథ్, సోషల్ మీడియా సంతోష్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ గుప్తా, మల్లికార్జున్‌పాటిల్, సుధీర బందారి, పూల సంతోష్, సురేష్ పూరి, అరుణ కౌలాస్, అనిత స్వామి, అనిత పాటిల్, అర్చన సారద, విశ్వనాథ్ యాదవ్, వంపీ, వెంకట్ పాల్గొన్నారు.

### సిర్గాపూర్‌లో ఓటరు దినోత్సవం

**సిర్గాపూర్, జనవరి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని పుర స్కరించుకుని విద్యార్థులు అధికారులతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో విద్యార్థులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఓటుతో కలిగే ప్రయోజనాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఝరాసంగంలో...**

**ఝరాసంగం, జనవరి 25, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంజీవరావు సూచించారు. గురువారం ఝరాసంగంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా యువకులు, విద్యార్థులతో కలిసి అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెంకటేవం, రాజు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, యువకులు